అల్లూరి పోరాటం అందరికీ ఆదర్శం

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్
- ఘనంగా మన్యం వీరుడి జయంతి వేడుకలు



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్ తదితరులు

విశాఖ విద్య: దేశ స్వాతంత్ర్య సాధన కోసం అల్లూరి సీతారామరాజు చేసిన అలుపెరుగని పోరాటం అందరికీ ఆదర్శనీయమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. మన్యం వీరుడు అల్లూరి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. 52వ వార్డులోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, హెచ్ఆర్‌సీఐ జాతీయ కన్వీనర్ అల్లా కృష్ణతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్యసాధన కోసం అల్లూరి చేసిన పోరాటాలు నేటితరానికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. భారతీయుల హక్కుల కోసం బ్రిటిష్ వారిని ఎదురించి పోరాడిన ఆ మహనీయుడిని స్మరించుకోవాల్సిన అవసరం ప్రతీ ఒక్కరికీ ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



90వ వార్డు అల్లూరి సీతారామరాజు పార్కులో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాలనీ వాసులు

తహసీల్దార్ కార్యాలయంలో..

గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి తహసీల్దార్ విజయ భాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వరాజ్య సాధన కోసం అల్లూరి చూపిన తెగువ, పట్టుదల ప్రతీ ఒక్కరికీ ఆదర్శకం కావాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్, వీఆర్వో సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ రోహిత్, కంప్యూటర్ ఆపరేటర్ వంశీ, వీఆర్ఏ శంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు అల్లూరి స్ఫూర్తి

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు అల్లూరి సీతారామరాజు కాలనీలోని అల్లూరి విగ్రహానికి ముఖ్య అతిథి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రజలకు అండగా నిలిచి, సాయుధ పోరాటంతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, మన్యం ప్రజల్లో ధైర్యాన్ని నింపిన స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. నేటి యువత అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు.



అల్లూరికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ విజయభాస్కర్, ఆర్ఐ సురేష్ తదితరులు

కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు రఘు, జీవన్, స్థానిక నాయకులు లక్ష్మణ్, ఫణికుమార్, బాబూరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కులో..

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు అల్లూరి సీతారామరాజు పార్కులో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్కులోని అల్లూరి విగ్రహానికి ముఖ్య అతిథి కార్పొరేటర్ బొమ్మిడి రమణ పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరాజు, స్థానికులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో..

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ప్రధానోపాధ్యాయుడు కె.అప్పారావు, స్కూల్ కమిటీ చైర్మన్ నీలాపు శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. విదార్థులు నీతి, నిజాయితీ, నిబద్ధతతో జీవించాలని హితవు పలికారు. అల్లూరి విగ్రహ దాత భరాయ్ అర్జున్ ప్రసాద్‌కు ఈ సందర్భంగా కృతజతలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏఎస్సార్ కాలనీలోని అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు



హెచ్‌సీ వెంకటాపురం స్కూల్‌లో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్ఎం అప్పారావు, విద్యార్థులు

క్లుప్తంగా

వృద్ధురాలికి ఆశ్రయం



వృద్ధురాలితో షెల్టర్ మేనేజర్ మమత

విశాఖ విద్య: అనాథ వృద్ధురాలికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ప్రత్యేక చొరవ తీసుకొని ఆశ్రయం కల్పించారు. కంచరపాలెం ట్రైన్ వాష్ ఏరియాలో వృద్ధురాలు కొంతకాలంగా మెట్ల కిందనే ఉంటూ జీవనం సాగిస్తోందని సమాచారం తెలుసుకున్న జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడికి వెళ్లి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. మతిస్థిమితం లేకపోవడంతో వివరాలు చెప్పలేదు. ఆ వృద్ధురాలికి భాష కూడా సరిగా రాకపోవడంతో ఆదర్శనగర్‌లోని మన కుటుంబం వృద్ధాశ్రమానికి గురువారం తరలించి సేవలు అందించారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ విద్యాసాగర్

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లోని రాయల్ విద్యాలయంలో జనసేన వార్డు అధ్యక్షుడు గొరిపూటి శివ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాదవ ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ జోలికి ఎవరూ వెళ్లవద్దని, వ్యసనాలకు బానిసైతే జీవితం దుర్భరమవుతుందన్నారు. నాని పిల్లి నానాజీ, దాడి లలిత, ధనా, రాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న బాబూరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు అల్లూరి సీతారామరాజు కాలనీలో కొన్నాళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళకు వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడాల బాబూరావు రూ.2 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.

ఉద్యానవన పంటలతో ఎంతో మేలు



పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి సోని

గోపాలపట్నం: పంటలు పండించడంపై ఉద్యాన శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఉద్యానవన శాఖ అధికారి సోని మాట్లాడుతూ అవగాహనతో చేసిన వ్యవసాయం మంచి ఫలితాలు వస్తాయన్నారు. గోపాలపట్నం రైతుబజార్‌లో రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతికూల వాతావరణంలో కూడా పంటలు పండించవచ్చని తెలిపారు. ఉద్యానవన పంటల సాగు విధానాన్ని రైతులకు వివరించారు. ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి త్రినాథ్ మాట్లాడుతూ పందిరి వ్యవసాయం, బిందు సేద్యం వంటి విధానాలు లాభసాటిగా ఉంటాయన్నారు. సబ్సిడీకి ప్రభుత్వం విత్తనాలు అందజేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుబజారు అధికారి నారాయణరావు, సహాయకుడు శివ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ నుంచి హైసూకల్ వరకు ఉన్న ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న దుకాణాలను గురువారం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ దారిలో రాంగ్ రూట్ ప్రయాణాలను నిలిపి వేశారు. ఈ మార్గంలో పాదచారుల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఇక్కడి సమస్యపై 'రాంగ్ రూట్ ప్రయాణానికి చెక్' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు తక్షణం స్పందించారు. జూన్ 29న వెలువడిన 'నడిచే దారేది' అనే వార్తకు సంయుక్తంగా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. బంక్ జంక్షన్ నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఫుట్‌పాత్‌లపై నడిచే వీలు లేకపోవడంతో రోడ్డుపై నుంచే నడుస్తున్నారు. పాదచారులు కూడా ఇదే విధంగా ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని అధికారుల దృష్టికి 'సాక్షి' తీసుకురాగా.. వారి చర్యలతో ఇబ్బందులు తొలగాయి. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే గోపాలపట్నం బంక్ జంక్షన్ నుంచి ఎల్‌జీ పాలిమర్స్ వరకు, గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఇరువైపులా పెద్ద దుకాణదారులు కూడా వారి వ్యాపార సామగ్రిని ఫుట్‌పాత్, రోడ్డుపైనే పెడుతున్నారని, వాటినీ తొలగించాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.



టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణలను తొలగించడంతో ఖాళీగా కనిపిస్తున్న ఫుట్‌పాత్

ఇంటిని తలపించేలా విద్యార్థులకు భోజనాలు పెట్టాలి



కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో దివాకర్

కంచరపాలెం: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఇంటిని తలపించేలా పరిశుభ్ర వాతావరణంలో మధ్యాహ్న భోజనం అందించాలని గోపాలపట్నం మండల విద్యా శాఖాధికారి–2 డి.దివాకర్ సూచించారు. ప్రభుత్వ బడుల్లో బురదలో భోజనాలు శీర్షికన ఇటీవల అనేక కథనాలు రాష్ట్రంలో సంచలనం రేపడంతో విశాఖ జోన్–2 ఆర్‌జేడీ విజయ భాస్కర్, జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ ఆదేశాల మేరకు గురువారం కప్పరాడ జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఎంఈవో పర్యటించారు. మధ్యాహ్న భోజనాలు తినే ప్రాంతాలను పరిశీలించారు. డైనింగ్ హాల్‌లోనే విద్యార్థులకు భోజనాలు వడ్డించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరుబయట భోజనాలు చేయరాదని ఆయా పాఠశాలల హెచ్ఎంలు విజయమాలిని, సుధాలకు సూచించారు. విద్యార్థులు బయట భోజనాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో దివాకర్ హెచ్చరించారు. మధ్యాహ్న భోజనాలు చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కునేలా ఉపాధ్యాయులు విధిగా విద్యార్థులపై ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఐలతో డీసీపీ సమీక్ష

మర్రిపాలెం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు గురువారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో జోన్–2 పరిధిలోని సీఐలతో డీసీపీ మేకా సత్తిబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని, వాటిని సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. పలు కేసుల దస్త్రాలను పరిశీలించి తగు సూచనలిచ్చారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలన, రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. ఆకతాయిలు శాంతిభద్రతలకు భంగం కలిగేలా ప్రవర్తించినా, అల్లర్లు సృష్టించినా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐలు భాస్కరరావు, చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.



సీఐలతో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

శివనగర్ యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

మహారాణిపేట: మర్రిపాలెం శివనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఆరోగ్య కేంద్ర సిబ్బందికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కోసం పలు సూచనలిచ్చారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించి, కూలర్‌ను పరీక్షించి సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో సమక్షంలోనే కొంతమంది మధుమేహం, టీబీ వ్యాధిగ్రస్తులకు వ్యాక్సిన్లు వేశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమం జిల్లాలో ఏ విధంగా జరుగుతుందో పర్యవేక్షించడానికి జిల్లా ప్రోగ్రాం అధికారులు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి బి.ఉమావతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత వివిధ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సిబ్బందికి టీకా వేసే విధానం, వ్యాక్సిన్‌లో సిక్స్ ప్రియారిటీస్‌ను వివరించారు. లబ్ధిదారులకు వ్యాక్సినేషన్‌పై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సీ–సెక్షన్ ప్రసవాలను నివారించాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు అన్నారు. ఆరోగ్య సిబ్బంది అందరు సమయపాలన పాటించాలని, ముఖ్యంగా స్టాప్ డయేరియా కార్యక్రమం మీద ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



శివనగర్ ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

దిష్టిబొమ్మల్లా ట్రాఫిక్ సిగ్నళ్లు



ఇండస్ట్రియల్ ఎస్టేట్ రహదారిలో ఇలా..



కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి కూడలిలో నిరుపయోగంగా ట్రాఫిక్ సిగ్నళ్లు

- బీఆర్‌టీఎస్ రహదారిలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు
- గందరగోళంగా వాహనాల రాకపోకలు
- ప్రమాదాల బారిన చోదకులు, పాదచారులు
- దృష్టి సారించని ట్రాఫిక్ పోలీసులు

కంచరపాలెం: బీఆర్‌టీఎస్ రహదారిలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లు సక్రమంగా పనిచేయడం లేదు. కంచరపాలెం మెట్టు నేతాజీ ఫ్లైఓవర్ వంతెన కూడలి, ఊర్వశి జంక్షన్, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ జంక్షన్, 104 ఏరియా కూడలి, మర్రిపాలెం ప్రాంతాలకు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో సిగ్నల్ లైట్లు వెలగడం మానేశాయి. దీంతో అటుగా వాహనాలపై రాకపోకలు సాగిస్తున్న వారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ కూడళ్లలో ప్రమాదాలు సంభవిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.

తుప్పుపట్టి నిరుపయోగంగా..

బీఆర్‌టీఎస్ రోడ్డులో ఐదేళ్ల కిందట ఎల్లో స్తంభాలతో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. కాలక్రమేణా అవి తుప్పు పట్టి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. నీలం రంగులో ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాలు పాత వాటి పక్కనే ఏర్పాటు చేశారు. ఏళ్లు గడుస్తున్నా.. వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటుంది. ఆయా కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయక పోవడంతో రోడ్డు దాటాలంటేనే స్థానికులు, పాదచారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వాహన చోదకులు గందరగోళంగా రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి ట్రాఫిక్ సిగ్నళ్లను అందుబాటులోకి తీసుకురావాలని వారంతా కోరుతున్నారు.



ఊర్వశి జంక్షన్‌లో పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు

సిగ్నల్ లైట్లను వెలిగించండి



బీఆర్‌టీఎస్ రహదారుల్లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో వాహన చోదకులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంటోంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

– లగుడు వెంకటరావు, జ్ఞానాపురం

అధికారులు చర్యలు చేపట్టాలి



ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా.. బీఆర్‌టీఎస్ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సిగ్నల్ లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వెంకటేష్, కంచరపాలెం

రేబిస్ టీకాల శిబిరం రేపు

విశాఖ విద్య: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈ నెల 6న గోపాలపట్నం ప్రాంతీయ పశు వైద్యశాలలో ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తామని ఆస్పత్రి వైద్యుడు ఎ.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 89, 90, 91, 92 వార్డుల్లోని పెంపుడు కుక్కలను శనివారం ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.5.20 లక్షలు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 90 రోజులకు రూ.5,20,922 ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ముందుగా వెంకన్నకు నిత్య పూజలు చేశారు. ఈవో నీలిమ, ఆలయ ప్రధానార్చకుడు మహర్షి రామానుజాచార్యులు, భక్తులు, వెంకన్న సేవలు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్య కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బాల్య వివాహాలపై కళాజాత



కళాజాతలో గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

గాజువాక: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన కళాజాత అందర్నీ ఆకట్టుకుంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 66వ వార్డు అజీమాబాద్ అంగన్వాడీ కేంద్రం వద్ద గురువారం కళాజాత నిర్వహించారు. కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, మహిళలకు బాల్య వివాహాలవల్ల తలెత్తే ఇబ్బందులను కళాకారులు ఆట, పాటలద్వారా వివరించారు. బాలల హక్కులు, చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.